

# సూర్య

www.suryaa.com

ఏలూరు జిల్లా
పశ్చిమ గోదావరి జిల్లా

శనివారం,27 సెప్టెంబర్ 2025

8 పేజీలు


## వైద్యులు జవాబుదారీతనంతో
# పని చేయాలి

- ఏలూరు ఆసుపత్రికి మరో రూ.5 కోట్లతో ఆధునిక వైద్య పరికరాలు
- రూ.60 లక్షలతో రెండు అంబులెన్స్‌లు
- రూ.1 కోటి విలువైన వైద్య పరికరాలు ప్రారంభించిన ఎంపీ,కలెక్టర్,ఎమ్మెల్యే







**ఏలూరు,మేజర్‌న్యూస్:** జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి గెయిల్‌సంస్థ కార్పొరేట్ సామజిక బాధ్యత లో భాగంగా అందించిన కోటి రూపాయల విలువైన ఆధునిక వైద్య పరికరాలను ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడుతూ పేదప్రజల ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో ప్రాధాన్యతను ఇస్తున్నారని, అందుకు తగిన విధంగా వైద్య సిబ్బంది జవాబు దారీతనంతో పనిచేసి ప్రభుత్వ ఆసుపత్రుల ప్రతిష్ట పెంచాలన్నారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి ఎటువంటిస్థితిలో ఉన్న పేషంట్ వచ్చినా విజయవాడ వంటి ప్రదేశాలకు రెఫర్ చేసే పరిస్థితి రాకుండా చికిత్స అందించేలా అన్ని రకాల ఆధునిక వైద్య పరికరాలు, వైద్యసిబ్బంది నియామకం చేస్తామని,అదే సమయంలో ఆసుపత్రికి వచ్చిన పేదప్రజలు అక్కడ

- తరువాయి 2లో..





## దోబూచులాడుతున్న
# కొల్లేరు వరద !

- పెద్ద ఎడ్లగాడి వద్ద పెరుగుతున్న నీటిమట్టం
- పెనుమాక లంక గ్రామానికి వెళ్లే రహదారికి అంతరాయం

**కైకలూరు,మేజర్‌న్యూస్:**ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో మండలంలోని పెద్ద ఎండ్లగాడి వద్ద కొల్లేరులో వరద నీటిమట్టం పెరుగుతూ,తగ్గుతూ దోబూచులాడుతుంది. శుక్రవారం మధ్యాహ్నానికి 2.5మీలకు చేరిన నీటి మట్టం క్రమంగా తగ్గుతూ రాత్రి8గంటల సమయానికి 2.3 అడుగులకు చేరుకుంది. క్రమంగా పెరుగుతూ, తరుగుతూన్న కొల్లేరు వరద ప్రజల్లో ఆందోళనను రేకెత్తిస్తుంది. అల్పపీడ ప్రభావంతో మరో నాలుగు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు పడతాయి అన్న వాతావరణ అధికారులు హెచ్చరికతో సోమవారం సాయంత్రం వరకూ కొల్లేరుకి వరద పెరిగే అవకాశం ఉందని జల వనరులశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు .పెదఎడ్ల గాడివద్ద నీటిమట్టం 3మీలకు చేరుకుంటే గ్రామాలకు ముంపు తప్పదన్న విషయం తెలిసిందే. అల్పపీడనం ప్రభావంతో కొద్దిరోజులగా కురుస్తున్న వర్షాలకు కొల్లేరులో వరద ఉధృతి పెరిగింది .ఎన్నడూ లేని రీతిలో కొల్లేరుకు ఎగువ 64 డ్రెయిన్ల నుంచి పెద్దఎత్తున

- తరువాయి 2లో..

# పెన్నాడ అగ్రహారంలో కుల బహిష్కరణ

- న్యాయం కోరుతూ బాధితుల ఆందోళన





**పాలకోడేరు/భీమవరం,మేజర్‌న్యూస్ :** స్వాతంత్ర్యం వచ్చిన 79 ఏళ్లు గడిచినా ఇంకా కుల వివక్షలు, బహిష్కరణలు కొనసాగుతుండటం దురదృష్టకరమని చెబుతున్న సంఘటన పాలకోడేరు మండలం పెన్నాడ అగ్రహారంలో చోటుచేసుకుంది. పెన్నాడ అగ్రహారం తామర చెరువు గట్టులోని శెట్టిబలిజ సంఘంసభ్యులు పంచాయతీ కార్యాలయంలో వినతిపత్రం సమర్పిస్తూ, మమ్మల్ని కుల బహిష్కరణకు గురిచేసి, సంఘ కార్యక్రమాల నుండి వేరుచేస్తున్నారు అనిఆరోపించారు. బాధిత కుటుంబాలుశుక్రవారం ఈవిషయంపై ఆందోళన చేపట్టాయి. వారి వాంగ్మూలం ప్రకారం,సంఘంలోని కొంత మంది పెద్దలు దొమ్మేటి వేణుగోపాళం, పంపన వెంకటేశ్వరరావు, పాలాశేషు, గుత్తుల కొండలరావు, జక్కంశెట్టి బాలమురళీ కృష్ణ, చింతపల్లి రామకృష్ణ తదితరులు-గ్రామంలోని సుమారు 15 కుటుంబాలను ప్రేమ వివాహం చేసుకున్నారన్న కారణంతో ఒకరిని, భూమి అమ్మడానికి నిరాకరించారన్న కారణంతో మరొకరిని, వేరే కులానికి చెందిన వారిని పెళ్లి చేసుకున్నారన్న కారణంతో పక్కన పెట్టి, ఏ కార్యక్రమానికీ పిలవకుండా, వారితో మాట్లాడకపోగా, ఇతర సభ్యులను

- తరువాయి 2లో..

## జిల్లా పోలీస్ కార్యాలయానికి నెక్స్‌జెన్‌చే వాహనం బహుకరణ



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** జిల్లా పోలీస్ కార్యాలయానికి ఎక్స్యువి పోలీస్ వాహనాన్ని జాలిపూడికి చెందిన నెక్స్‌జెన్ చైర్మన్ సుబ్రహ్మణ్యం జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్‌కు శుక్రవారం ఉదయం అందించారు. ఈ వాహనాన్ని ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌కు వినియోగించనున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. పోలీసుశాఖకు ఈ వాహనాన్ని అందించినందుకు జిల్లా ఎస్పీ సుబ్రమణ్యంకు కృతజ్ఞతలు తెలిపారు.

## పెరుగుతున్న గోదావరి - వరద ముంపులో రహదారులు

- 16 గ్రామాలకు నిలిచిన రాకపోకలు - నీట మునిగిన పంటలు
- భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ



**వేలేరుపాడు,మేజర్‌న్యూస్ :** గోదావరి నదికి భారీగా వరద చేరుతోంది. అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు క్రమంగా గోదావరి పెరుగుతోంది. మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాల్లో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. ఈ నేపథ్యంలో వాగులు,వంకలు ఉధృతంగా

- తరువాయి 2లో..




# సహకార మార్కెటింగ్ సొసైటీ మహాజనసభ



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఉమ్మడిపశ్చిమగోదావరి జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ (డీసీఎంఎస్) ప్రధానకార్యాలయం ఏలూరులో డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళికృష్ణ (చిన్న ) అధ్యక్షతన శుక్రవారం మహాజన సభసమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లాలోని అన్ని సొసైటీల అధ్యక్షులు హాజరయ్యారు.వారిని ఘనంగా సత్కరించి తిరుపతి ప్రసాదాన్ని అందజేశారు.

ముఖ్య అతిధిగా డీసీసీబీ అండ్ అపకబ్ చైర్మన్ గన్ని విరంజనేయులు, డీసీవో మురళికృష్ణ, డిఎల్సిఓ సత్యవతి సొసైటీ చైర్మన్లు పాల్గొన్నారు. అనంతరం డిసిఎంఎస్ చైర్మన్ మురళీకృష్ణ, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులును సిబ్బంది గజమాలతో సత్కరించారు.

## పేకాట స్థావరంపై దాడి : నలుగురి అరెస్టు

**పెదవేగి,మేజర్ న్యూస్ :** మండలంలోని రాయుడి పాలెం గ్రామంలో పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 10,500 నగదు స్వాధీనం చేసుకొన్న పెదవేగి సీఐ సిహెచ్. రాజశేఖర్. జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు, అసాంఘిక కార్య కలాపాలను నిర్మూలించేందుకు చేపట్టిన చర్యల భాగంగా, పెదవేగి సీఐకి రాబడిన సమాచారం పై పోలీసులు రాయుడి పాలెం గ్రామములో పేకాట స్థావరంపై దాడి నిర్వహించారు. ఈ సంఘటనపై పెదవేగి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు.ఈ సందర్భంగా పెదవేగి ఇన్స్పెక్టర్ సిహెచ్. మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు ప్రజల జీవితాలపై దుష్ఫలితాలు కలిగిస్తాయి. పేకాట, మద్యం అక్రమ రవాణా వంటి కార్యకలాపాలపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని హెచ్చరించారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించే వారి సమాచారాన్ని డయల్ 112 ఈకుగాని దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ లో తెలియజేయాలని ఆయన కోరారు.

## ఎస్సీ కార్పొరేషన్ జూనియర్ అసిస్టెంట్‌పై కేసు నమోదు

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఎస్సీ కార్పొరేషన్ ఈడీ చెక్కులను ఆయనకు తెలియకుండా దొంగిలించి, ఆయన సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఘటనలో జూనియర్ అసిస్టెంట్ పై ఏలూరు 3టౌన్‌లో గురువారం రాత్రి కేసు నమోదయింది. ఎస్సీ కార్పొరేషన్‌లో పి.పవన్ కుమార్ జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సంతకాన్ని ఫోర్జరీ చేసి 6లక్షల రూపాయలను బ్యాంకు నుండి విత్ డ్రా చేశాడు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి పవన్ కుమార్ ను విధుల నుండి తప్పించారు.సిఐ కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జి.ఎస్.టి 2.0 సంస్కరణలతో తగ్గుతున్న ధరలు

**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్:** ఆత్మ నిర్భర్, వికసిత్ భారత్ స్ఫూర్తి తో ప్రధాని నరేంద్ర మోదీ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జి.ఎస్.టి 2.0తో సంస్కరణలు ప్రతి ఇంటా స్వదేశీ, ఇంటింట స్వదేశీ జి.ఎస్.టి తగ్గింపును సద్వినియోగం చేసుకోవాలని జంగారెడ్డిగూడెం పట్టణ టిడిపి అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్ కోరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని సెప్టెంబర్ 22 నుంచి జీఎస్టీ 2.0 సంస్కరణలు అమలులోకి తీసుకురావడం పట్ల ప్రజలపై ఖర్చుబారం తగ్గుతోందని తెలిపారు. ఈ జిఎస్టి సంస్కరణల వలన ప్రజలకు కలిగే లాభాలను ఆర్థికంగా ఎంత తగ్గుతున్నాయే సవివరంగా కిషోర్ వివరించారు.

## పంచాయతీల 'ఓన్‌సోర్స్ రెవెన్యూ' పై శిక్షణ

**- ముఖ్య అతిథిగా పాల్గొన్న డిఎల్‌డిఓ ఎం.శ్యామల**






**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పంచాయతీరాజ్ కమీషన్ ఆదేశాల మేరకు పంచాయతీ మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలకు రెండు రోజుల పాటు నిర్వహి ంచూ శిక్షణా తరగతులు ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పెద్దాపురం డిఎల్‌డిఓ ఎం.శ్యామల పాల్గొని మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో ఏ విధంగా ఆదాయమును పెంపొందించుకోవచ్చునో ఈ శిక్షణలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, కావున ప్రతీ ఒక్కరూ పంచాయతీ ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆమె సూచించారు. దీనిలో భాగంగా ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ, డిప్యూటి ఎంపిడిఓ జి.వి.శేఖరరెడ్డిలు గ్రామ పంచాయతీల ఆదాయ వనరులను పెంచుకొను మార్గములను వివరంగా తెలిపారు. వాలుతిమ్మాపురం గ్రామ పంచాయతీ సెక్రటరీ కె.వెంకటేష్ శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కట్టమూరు సర్పంచ్ దిమ్మల పుష్పరత్నం, మండల పరిషత్ కార్యాలయ ఏఓ సత్యనారాయణమూర్తి, పంచాయతీ సెక్రటరీలు బి.వి.వి.రమణ, నక్కా సత్యనారాయణ, ప్రతాప్, ఈశ్వరరావు, శ్రీనివాసరావు, అన్నపూర్ణ, జానిఖాన్, కళావతి, బషీర్, వి.శ్రీనివాసరావు, ఫణికుమార్, పలువురు పంచాయతీ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య డిగ్రీ కళాశాలలో అన్వేక్ష -2025 కార్యక్రమం

**- భవిష్యత్ ఉద్యోగాల్లో మంచి అవకాశాలున్న రంగం డేటా సైన్స్**

**- ఎం. అరవింద్ కిరణ్**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఆదిత్య డిగ్రీ కళాశాల బి సి ఎ డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో అన్వేక్ష-2025 కార్యక్రమం నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీ.జి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్. నాయుడు తెలియజేశారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో డేటా సైన్స్ ప్రాధాన్యత పై ప్రత్యేక అవగాహన సదస్సు అన్వేక్ష-2025 కార్యక్రమం జరిగింది. డేటా సైన్స్ విద్యార్థులలో నైపుణ్యాలను వెలికి తీసే ఉద్దేశ్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ఈరోజు ప్రపంచం మొత్తం డేటా సైన్స్ నిపుణుల కోసం ఎదురుచూస్తోంది. ప్రతి రంగంలో డేటా అనాలిసిస్ అవసరమవుతోంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఈ కోర్సును పట్టుదలతో నేర్చుకో వాలని పిలుపునిచ్చారు. మేకిన్ ఇండియాలోయవభాగస్వామ్యం ప్రధానమని అన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డేటా సైన్స్ ఎన్ టి టి అసోసియేట్ డైరెక్టర్ ఎం. అరవింద్ కిరణ్ మాట్లాడుతూ డేటా సైన్స్ అనేది విద్యార్థులు పైతాన్, ఎస్ క్యూ ఎల్ , మిషన్ లెర్నింగ్, టూల్స్ పై దృష్టి పెట్టాలి. ప్రాజెక్ట్‌లు, ఇంటర్న్‌షిప్‌లతో అనుభవం పెంచుకోవాలి. శ్రమతో సిద్ధమైతే ఉద్యోగాలు తప్పక సాధ్యమే అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన డేటా సైన్స్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్చార్జి మూర్తి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి విఎస్ఎన్ కుమార్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మరిడమ్మ దేవస్థానం నందు కూచిపూడి నృత్యం

**- పాల్గొన్న నృత్యకారిణిలు**



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం శ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానంలో దశమి నవరాత్రులలో భాగంగా దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో ధర్మపథంలో భాగంగా దేవస్థానం నందు కూచిపూడి నృత్యం శుక్రవారం నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో పలువురు నృత్య కళాకారిణిలు (చిన్నారులు) పాల్గొని తమ కళారూపాలను ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్ర ప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది ఎస్.వెంకటరమణ, వరహాలు, క్రాంతివీర్, లోవ, శివ,తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులు జవాబుదారీతనంతో పని చేయాలి

మొదటిపేజి తరువాయి

అందిన వైద్య సేవలతో సంతృప్తితో ఇంటికి వెళ్లగలిగే పరిస్థితి ఉండాలన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి 7 కోట్ల రూపాయల విలువైన అత్యంత ఆధునిక వైద్య పరికరాలు కోరారని,అవి కూడా అందించేందుకు చర్యలు తీసుకుంటానని, 60 లక్షల రూపాయలతో ఆధునిక పరికరాలు కలిగిన 2 అంబులెన్స్ లు త్వరలో అందిస్తానన్నారు.జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ గెయిల్ సంస్థ అందించిన వైద్య పరికరాల ద్వారా ప్రతీ నెల 300 ప్రసవాలు, 150 సర్జరీలు, 1500 పైగా రక్తపరీక్షలు అదనంగా చేయవచ్చున్నారుపేదప్రజలకు సంతృప్తికరమైన రీతిలో వైద్య సేవలందేలా వైద్యులు, సిబ్బంది పనిచేయాలన్నారు.శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ పేదప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ వైద్యులపై ఉందన్నారు.అనస్థీషియా వర్క్ స్టేషన్ (2), కార్డియోటోకోగ్రఫీ మెషిన్లు (2), కంప్యూటెడ్ రేడియోగ్రఫీ సిస్టమ్ (ఎక్స్‌రే క్యాసెట్ రీడర్), హెమటాలజీ అనలైజర్ (ఓపెన్ లూప్),ఆపరేషన్ థియేటర్ లైట్లు (10), ఐసిఇ లైన్డ్ రిఫ్రిజిరేటర్లు వంటి 18 వైద్య పరికరాలు అందించారు. ఈ సందర్భంగా గెయిల్ సంస్థ ప్రతినిధులు నారాయణ, ప్రభాకర్ లను ఎంపీ పుట్టా మహేష్, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు ఘనంగా సత్కరించారు.అనంతరం ఆసుపత్రికి వైద్య పరికరాలు అందించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్,ఎమ్మెల్యే బడేటి రాధా కృష్ణయ్య (చంటి)లను ఆసుపత్రివర్గాలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ఎం.ఎస్. రాజు,డిఎంహెచ్ఓ డా.పి.జె.అమృతం, డిసిహెచ్ఎస్ డా.పాల్ సతీష్, ఏలూరు తహసీల్దార్ గాయత్రి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శరత్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దోబూచులాడుతున్న కొల్లేరు వరద !

మొదటిపేజి తరువాయి

వరద నీరు రావడంతో కొల్లేరు ఉగ్రరూపం దాల్చింది.దీంతో మండవల్లి మండలంలోని కొల్లేటి లంక గ్రామాలకు ప్రధాన రహదారి అయిన పెద్దఎడ్లగాడి వద్ద పెనుమాకలంక ఆర్అండ్ బి రహదారి శుక్రవారం ఉదయానికే మూడుచోట్ల వరద నీటిలో చిక్కుకోవడంతో రాకపోకలు నిలిచాయి.వరదనీటిఉధృతితో మణు గూలూరులంక ,పెనుమాకలంక,నందిగామలంక, శ్రీరామనగర్, ఇంగిలిపాకలంక, నుచ్చుమిల్లి, తక్కిళ్లపాడు, పుల్లపర్రు గ్రామాలకు ముంపు పొంచి ఉంది. కైకలూరు మండలంలో కొల్లేటికోటలోని సర్కారు కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది.

## పెన్నాడ అగ్రహారంలో కుల బహిష్కరణ

మొదటిపేజి తరువాయి

కూడా వారితో కలవకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన చెందారు.చివరకు శుభకార్యాలలో వెలివేసిన కుటుంబానికి చెందిన పిల్లలను కూడా రానివ్వకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. మా మీద ఎలాంటి గొడవలు లేకపోయినా ఈ అన్యాయానికి గురిచేస్తున్నారు. ఇలాంటి చిత్రహింసలు తట్టుకోలేక పోతున్నాం. పంచాయతీ ద్వారా మాకు న్యాయం చేయాలి అని బాధితులు దొంగ నాగలక్షిం, దొమ్మేటి వెంక ఆశ్వరరావు,జక్కనెట్టి సత్య హింగరాజు,శుతుల నాగరాజు, సిహెచ్ సుబ్రమ్మనం, చింతపల్లి శివ ప్రసాద్,గుర్తుల శ్రీనివాసు విజ్ఞప్తి చేశారు.అనంతరం ఆందోళన చెందుతున్న ప్రదేశానికి రూరల్ సీఐ శ్రీనివాసరావు, పాలకోడేరు ఎస్సై రవివర్మ, రెవిన్యూ సిబ్బంది చేరుకొని బాధితులను అడిగి వివరాలు తెలుసుకొని సమస్య పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని తెలిపారు.

## పెరుగుతున్న గోదావరి - వరద ముంపులో రహదారులు

మొదటిపేజి తరువాయి

ప్రవహిస్తున్నాయి ఎగువన జలా శయాలు నిండి దిగువకు నీరు విడుదల చేస్తుండటంతో గోదావరి నదికి వరద చేరుతోంది. భద్రాచలం వద్ద శుక్రవారం ఉదయం 8గం.లకు వరద 41.60 అడుగులకు ప్రవహిస్తూ సాయంత్రానికి 44.80 అడుగులు చేరుకొని ఉధృతంగా ప్రవహిస్తోంది.భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో అధికారులు అప్రమత్తమై ముంపు గ్రామాల్లో సహాయక చర్యలు చేపడు తున్నారు.రుద్రంకోట, వేలేరుపాడు ప్రధాన రహదారి పైకి వరద చేరి రాకపోకలు నిలిచి పోయాయి.అలాగే వేలేరుపాడు, ఎడవల్లి ఎద్దువాగు లోలెవెల్ వంతెన పైకి వరద చేరడంతో 16 గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి.

గోదావరి ఉపనది శబరి నది సైతం ఉధృతంగా ప్రవహిస్తుండటంతో తీర ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు.అల్లూరి జిల్లా కూనవరం వద్ద గోదావరి నది మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

# మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు





**– జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**ఉండి,మేజర్ న్యూస్ :** ఉండి మండలం యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "స్వస్థనారి స్వశక్త పరివార్ అభియాన్" మెడికల్ క్యాంపును జిల్లాకలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా సందర్శించారు తొలుత పిహెచ్‌సిలోని అన్ని వార్డులను పరిశీలించి అందిస్తున్న సేవలుపై ఆరా తీశారు. ఆబా ఐడి రిజిస్ట్రేషన్ ఎంత వరకు పూర్తి చేశారు.ఇంకా ఎన్ని చేయాలి,ఈ నెలలో ఎన్ని ప్రసవాలు చేశారు, ల్యాబ్ టెస్టులు ఎన్ని పూర్తి చేశారు, కౌమార దశ బాలికలకు పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా, ఎనీమియా ముక్తభారత్ కింద పరీక్షలు చేసి రక్తహీనత ఉన్నవారికి టాబ్లెట్లు అందిస్తున్నారా, వృద్ధులకు టీబీ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నారా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీలతో మాట్లాడుతూ బాలామృతం సక్రమంగా అందిస్తున్నారా, గర్భిణీ స్త్రీలకు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడానికి అవగాహన కల్పిస్తున్నారా అని ప్రశ్నించారు.ఈరోజు నిర్వహిస్తున్న స్వస్థనారి స్వశక్త పరివార్ అభియాన్ మెడికల్ క్యాంపులో ఎంతమంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు, స్త్రీలకు, బాలికలకు అందరికీ తప్పనిసరిగా వైద్య పరీక్షలు నిర్వహించాలని, ఇంకా క్యాంపుకు రాని వారికి అవగాహన కల్పించి క్యాంపుకు వచ్చేలా చూడాలని ఆదేశించారు.డిఎంహెచ్వో డాక్టర్ జి.గీతా బాయి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఈనెల 17వ తేదీ నుండి వచ్చే అక్టోబర్ 2వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సామాజిక ఆరోగ్య కేంద్రాలు గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. చాలామంది మహిళలకు ఆరోగ్యపు అలవాట్లపై సరైనఅవగాహనలేకపోవడంతో అనారోగ్యం పాలవుతున్నారని. ప్రోటీన్లు ఫైబర్ తదితర బలవర్ధకమైన ఆహారంఎందులోఉందో అవగాహన పెంపొందించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో డాక్టర్ జి.గీతాబాయి,పిహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.బెన్నీ సామ్యూల్, డాక్టర్ ఐ.సి కీర్తన, గైనకాలజిస్ట్ డాక్టర్ కె.దివ్య శ్రీ, ఆఫ్తాల్ టెక్నీషియన్ జగదీష్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, మహిళలు, విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మహాలక్ష్మి అలంకరణలో కుంకులమ్మవారు



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** గ్రామ పొలిమేరలో వేంచేసియున్న శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.ఉదయం ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు చేసి రుత్వికులు హెూమాన్ని నిర్వహించారు.అమ్మవారుశుక్రవారం మహాలక్ష్మీ దేవిగా భక్తులను కరుణిస్తున్నారు మంగళప్రదమైన దేవత మహాలక్ష్మీ దేవి జగన్మాత మహాలక్ష్మి స్వరూపంలో దుష్ట రాక్షస సంహారాన్ని చేయడం ఒక అద్భుత ఘట్టం మూడు శక్తులలో ఒక శక్తి అయిన మహాలక్ష్మి అమితమైన పరాక్రమాన్ని చూపించి అనే రాక్షసుణ్ణి సంహరించింది.లోక స్థితి కారిణి గా ధన,ధాన్య, ధైర్య,విజయ, విద్య, సౌభాగ్య సంతాప గజలక్ష్మి గా వరాలను ప్రసాదించే అష్టలక్ష్మి సమిష్టి రూపమైన అమృత స్వరూపునిగా కుంకుళ్ళమ్మ మహాలక్ష్మిగా దర్శించవచ్చు.మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకోవడం వల్ల భక్తులందరికీ ఐశ్వర్య ప్రాప్తి, విజయం లభిస్తుందని.ఆలయ పుజరి పుసులూరి భైరవ స్వామి భక్తులకు వివరించారు.భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు.

# నడకతో గుండె ఆరోగ్యం

**– ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్. లక్ష్మణ్**




**కొయ్యలగూడెం రూరల్,మేజర్ న్యూస్ :** ప్రస్తుత ఆధునిక సమాజంలో గుండె ఆరోగ్యం పై ప్రతి ఒక్కరు వ్యక్తిగత శ్రద్ధ వహించి గుండెను కాపాడుకోవాలని రోజుకు 30 నిమిషాలు నడక ద్వారా గుండె ఆరోగ్యం నిలకడగా ఉంటుందని (పల్స్ హాస్పిటల్) ప్రముఖ గుండె వైద్య నిపుణులు కొల్లూరు లక్ష్మణ్ తెలియజేశారు.ఈ సందర్భంగా కొయ్యలగూడెంలో ఆరోగ్య మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్ డే కార్యక్రమాన్ని పురస్కరించుకుని హాస్పటల్ వద్ద నుండి రెండు కిలోమీటర్లు మేర వాకింగ్ ర్యాలీ గ్రామంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ కొల్లూరు లక్ష్మణ్ ఆయన మాట్లాడుతూ వయసు పైబడిన వారు బీపీ,షుగర్,గుండె, సంబంధిత వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా 30 నిమిషాలు నడక ద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని, అన్నారు. ప్రతి శనివారం ఆరోగ్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో గుండె వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ నరహరశెట్టి సతీష్,రోటరీ క్లబ్ అధ్యక్షుడు మాదేటి సత్యనారాయణ,చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్.చక్రపాణి,స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ .భాగ్యలక్ష్మి,వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.బి.జి .శేఖర్, రోటరీ క్లబ్ సభ్యులు,ఆరోగ్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సెయింట్ థెరీసాలో జానపద సంస్కృతి,సాహిత్యంపై అంతర్జాతీయ సదస్సు




**ఏలూరు,మేజర్న్యూస్:**స్థానిక సెయింట్ థెరీసా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాలలోని హిందీ ,తెలుగు విభాగం వారు ఇటీవల జానపద సంస్కృతి,సాహిత్యం అనే అంశంపై అంతర్జాతీయ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు కెనడా, ఆస్ట్రేలియా, మలేషియా, వంటి విదేశాల నుంచి ప్రముఖ వక్తలతో పాటుగా సుమారు 300 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. వీరంతా విభిన్న ప్రాంతాల్లోని జానపద సంస్కృతి,సాహిత్యం వారసత్వ సంపదని ప్రపంచానికి అందించే ప్రయత్నం చేశారు. వివిధ ప్రాంతాల విద్వాంసులు,పరిశోధకులు సమర్పించిన 120 పత్రాలను తెలుగు, సంస్కృత భాషా పత్రాలతో ఒక ప్రతిని, హిందీ ,ఆంగ్ల భాషా పత్రాలతో 2వ ప్రతిని ముద్రించడం జరిగింది.ఈ ప్రతులను హిందీ తెలుగు విభాగం వారి ఆహ్వానం మేరకు ప్రధానాచార్యులు డాక్టర్ సిస్టర్ మెర్సీ, ఉప ప్రధానాచార్యులు సునీల రాణి, పరీక్షల నియంత్రాణాధికారి డాక్టర్ సిస్టర్ సుశీల ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు ,అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఉద్యమ ఆధార్ రిజిస్ట్రేషన్ కి 134 మంది



**బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్:** ఉద్యమ ఆధార్ రిజిస్ట్రేషన్ ని 134 మంది చిరు వ్యాపారస్తులు నమోదు చేయించుకున్నారని వెలుగు ఏపీఎం ఎస్వివి పద్మావతి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉద్యమ ఆధార్ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మండలంలో ఉన్న చిరు వ్యాపారస్తులు 134 మంది నమోదు చేయించుకున్నట్లు పద్మావతి తెలిపారు. ఉద్యమ ఆధార్ చేయించుకోవడం వల్ల చిరు వ్యాపారస్తులు ప్రభుత్వం అందించే రుణాలు తీసుకునేందుకు అర్హులవుతారని పద్మావతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది టెక్నికల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# 28న కె -9 ఆధ్వర్యంలో రామానుజాపురంలో ఉచిత వైద్య శిబిరం



**కొయ్యలగూడెం రూరల్,మేజర్ న్యూస్:** రామానుజాపురం గ్రామంలో కె9 నిర్వహకులు ఈనెల 28న నిర్వహిస్తున్నటువంటి ఉచిత మెడికల్ క్యాంపును గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ ఆడప నాగలక్ష్మి ,శ్రీకృష్ణ దేవరాయ కాపు సంఘం నాయకులు కోరారు. శుక్రవారం కరపత్రాన్ని విడుదల చేశారు.ఈసమావేశంలో జంగారెడ్డిగూడెం కు చెందిన శివ శంకర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ శివశంకరరావు దుట్టా వాణి సుబ్రహ్మణ్యేశ్వరి బృందం రోగులకు ఉచిత పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు.కె9 అధ్యక్షుడు తొమ్మిదేళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏజెన్సీ మెట్ట ప్రాంతాలలో అన్ని మండలాలలో వరుస సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

ప్రమాదానికి గురై కాళ్లు కోల్పోయిన అదే గ్రామానికి చెందిన పసుపులేటి విశ్వేశ్వరరావును స్థానిక కాపు నాయకులతో కలిసి పరామర్శించారు. త్వరలో తనకు ఆర్టిఫిషియల్ లింబ్ విశ్వేశ్వర రావుకు సంస్థ ద్వారా అందించేందుకు ప్రయత్నం చేస్తున్నామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కె9 కార్యదర్శి సీలం కృష్ణరాజు శ్రీకృష్ణ దేవరాయకాపు సంఘం గౌర అధ్యక్షుడు అడపా సత్య నారాయణ, అడపా రాంబాబు ( వీఆర్ఏ ),మలబత్తుల సత్యనారాయణ, గెలం వెంకటేశ్వర రావు, ఏసు లంక నాగార్జున, సొసైటీ అధ్యక్షులు కోనే శ్రీనివాసరావు, సెక్రటరీ ఆడప నాగేశ్వరరావు , వేదాంతపురం నాయకులు ముత్యాల తాతారావు, సర్పంచ్ సీతారామరాజు, అప్పన ప్రసాద్,ఎంపీటీసీ శంకర్ రాజేష్, కె9 బృందం, తదితరులు పాల్గొన్నారు.

## మానవత సంస్థకు ఫ్రీజర్ బాక్స్ అందజేత



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్:** మానవత స్వచ్ఛంద సేవ సంస్థ సమాజంలో సేవా కార్యక్రమాలు చేస్తూ రాష్ట్రంలో మంచి గుర్తింపు పొందిందని జంగారెడ్డి గూడెం పట్టణ ప్రముఖులు జెట్టి గురు నాధరావు అన్నారు. స్థానిక బాట గంగానమ్మ లే అవుట్ సమీపంలో మానవత అధ్యక్షులు అల్లూరి రామకృష్ణ ఆధ్వర్యంలో సెంట్రల్ కమిటీ మెంబర్ అయినాల రమణ మూర్తి సమక్షంలో శుక్రవారం కార్యవర్గ సభ్యులు మొగిలినీడి శ్యామ్ వితరణతో ఫ్రీజర్ బాక్స్ ను మానవత సంస్థకు అందజేశారు. కీర్తిశేషులు కలిదిండి జానకి వెంకట రాజు (సూపర్ వైజర్ రాజు) గొట్టు ముక్కల రాయప రాజుల జ్ఞాపకార్థం ఈ ఫ్రీజర్ బాక్స్ ను విశిష్ట అతిథులు గుర్నాధరావు మానవత సంస్థకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా తత్పరులు లవంశీ కుమార్ రాజు,త్రిపురా రమేష్,దల్లి ఆంజనేయ రెడ్డి,ఆకుల ధర్మరాజు, గద్దే సత్యనారాయణ,వెంకన్న బాబు,శ్యామ్ శ్రేయోభిలాషు లు,మానవత సభ్యులు పాల్గొన్నారు.

# తల్లికి వందనం,బ్రిడ్జిల లోపాలపై అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే బడేటి



**అమరావతి /ఏలూరు, ఉమ్మడి ప.గో.జిల్లా సూర్య బ్యూరో:** అసెంబ్లీ సమావేశాల్లో శుక్రవారం ఎమ్మెల్యే బడేటి చంటి తల్లికి వందనం లోని లోపాల గురించి మాట్లాడారు. తల్లికి వందనానికి సంబంధించి కొంతమందికి కరెంటు విషయంలో రెండు, మూడు మీటర్లు ఉన్నట్లుగానూ,అలాగే రెండు మూడు చోట్ల స్థలాలు లేకపోయినా, ఉన్నట్లుగా ఆధార్‌లో లింక్ చేయడం జరిగిందని తెలిపారు. ఇవన్నీ సచివాలయంలో అండర్ ప్రాసెస్‌లో ఉండటంవల్ల తల్లికి వందనం కొంతమందికి జమ కాలేదని వివరించారు.కనుక ఈ ఏడాదికి ఇది సాధ్యం కాకపోయినా వచ్చే ఏడాది అయినా సరే ఈ టెక్నికల్ ప్రాబ్లం ని సరిచేసి అర్హులైన వారికి తల్లికి వందనం జమ అయ్యే విధంగా ప్రయత్నించాలని బడేటి ప్రభుత్వాన్ని కోరారు.ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1టౌన్, 2టౌన్ ప్రాంతాలను కలుపుతూ గతంలో నిర్మాణమైన రైల్వే అండర్ బ్రిడ్జి ప్రస్తుతం అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ఉందని, దీని నిర్మాణానికి అవసరమైనన్ని నిధులను కేటాయించాలని ఏలూరుకు చెందిన సమాజ సేవ కర్త బి కె ఎస్ ఆర్ అయ్యంగార్,ఎమ్మెల్యే బడేటి చంటి దృష్టికి తీసుకు వచ్చారు. ఈ విషయమై శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడుని ఎమ్మెల్యే బడేటి చంటి కోరారు. అలాగే సుమారు 50 సంవత్సరాల క్రితం నిర్మించిన ఏలూరు జ్యూట్‌మిల్లు వద్ద ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రమాదకర పరిస్థితుల్లో ఉందని, దీని మరమత్తుల నిమిత్తం పెద్దమొత్తంలో నిధులు కేటాయించాలని సీనియర్ సివిల్ ఇంజినీర్ ఎం.చంద్ర శేఖర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా,ఆ విషయాన్ని కూడా ఆయన స్పీకర్‌ను కోరారు. ఏలూరు నగరాభివృద్ధే లక్ష్యంగా అహర్నిశలు పాటుపడుతున్న ఎమ్మెల్యే బడేటి చంటి రెండు ప్రధాన సమస్యలపై దృష్టిసారించారు.

నేరుగా ఈ అంశాలను స్పీకర్ దృష్టికి తీసుకువెళ్ళి సంబంధిత శాఖలకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యేలా చర్యలు తీసుకునేందుకు లేఖలు అందించారు. శుక్రవారం రాష్ట్ర శాసన సభ సమావేశాలకు హాజరైన ఎమ్మెల్యే బడేటి చంటి ఈ మేరకు రెండు వినతిపత్రాలను స్పీకర్‌కు అందజేశారు. ఏలూరు 1టౌన్, 2టౌన్ ప్రాంతాలను కలుపుతూ ఏర్పాటుచేసిన పవర్ పేట లోబ్రిడ్జికి అత్యవసర మరమత్తులు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం చేసి 25సంవత్సరాలకు పైగా అవుతోందని, ముఖ్యంగా ఈ బ్రిడ్జి ప్రాంతంలో నీరు నిలిచిపోయి ఉండడం వల్ల ఎన్నో సంఘటనలు చోటుచేసుకుంటు న్నాయని ఎమ్మెల్యే లేఖలో పేర్కొన్నారు. ఈ లోబ్రిడ్జి ప్రాంతంలో తక్షణ మరమత్తులు చేపట్టడంతో పాటు అత్యావసరంగా కొన్ని పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో రోడ్లు, భవనాల శాఖ ఉన్నతాధికారులను అప్రమత్తం చేసి బ్రిడ్జికి అత్యవసర మరమత్తులు చేపట్టి ఎటువంటి ప్రమాదకర పరిస్థితులు తలెత్తకుండా చూడాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడుకు అందజేసిన లేఖలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి విజ్ఞప్తి చేశారు.

# సంపదతో ఆదాయం సమకూర్చుకోవాలి

**– డివిజనల్ పంచాయతీ అధికారి ఏ.వి సుబ్బరాయన్**

**బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్:** తడి చెత్త పొడి చెత్త వేరు చూసి ఆదాయం సమకూర్చే విధంగా చర్యలు చేపట్టాలని జంగారెడ్డిగూడెం డివిజనల్ పంచాయతీ అధికారి ఏ.వి సుబ్బరాయన్ తెలిపారు. బుట్టాయిగూడెంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో జీలుగుమిల్లి కుక్కునూరు వేలేరుపాడు బుట్టాయిగూడెం పోలవరం కొయ్యలగూడెం మండలాలకు చెందిన స్వయం సహాయక సంఘాల సభ్యులకు వర్మీ కంపోస్ట్, పరిసరాల పరిశుభ్రత, తడి చెత్త పొడి చెత్త కార్యక్రమాలపై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా డివిజనల్ పంచాయతీ అధికారి సుబ్బరాయన్ మాట్లాడుతూ తడి చెత్త పొడి చెత్తను వేరు చేసి బయట మార్కెట్‌కు అమ్మడం వల్ల సంపద సృష్టించు కోవచ్చు అన్నారు.ఈ శిక్షణ కార్యక్రమమునకు బుట్టాయిగూడెం సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, డిపిఆర్



సి.డిసి ప్రసంగి రాజు,ఆర్‌పి సూర్య,ఎఫ్‌టి సి నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి దేవ ప్రియుడు ,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలి





**– అధికారులు ప్రోత్సహించాలి : జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టరేటు గౌతమి సమావేశ మందిరంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగు (ఏపిసియన్ యఫ్ ) ప్రకృతి వ్యవసాయంపై జాతీయ లక్ష్యం జిల్లాస్థాయి కన్వర్జెన్స్ సమావేశం, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన నిర్వహించారు.జిల్లాలో 2022- 23లో 47,639 మంది రైతులు 50,487 ఏకరాలు, 2023-24 లో 53,664 మంది రైతులు 59,784 ఏకరాలు, 2024-25 లో 54,696 మంది రైతులు 54,817 ఏకరాలు, 2025-26 లో 59,325 మంది రైతులు 58,112 ఏకరాలు జిల్లాలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని జిల్లా ప్రాజెక్టు మేనేజరు (పకృతి వ్యవసాయం), జిల్లా కలెక్టరుకు వివరించారు. జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ఏలూరు జిల్లాను మొదటి లేక రెండవ స్థానంలో నిలిచేలా విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించి మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. 59,325 మంది రైతులు పూర్తిగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని, ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించి, ఖర్చు తగ్గించు కోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ జెడి షేక్.హబీబ్ భాషా, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కె.సంతోష్, డిఆర్‌డిఏ పిడి ఆర్.విజయరాజు, డియంఐవో యస్.రామ్మోహన్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డా.బి.ప్రసాదరావు,జిల్లాప్రకృతి వ్యవసాయప్రాజెక్టుమేనేజరు బి.వెంకటేష్, డాట్ శాస్త్రవేత్త డా.కె.ఫణికుమార్, రైతులు, ప్రకృతి వ్యవసాయ సహాయకులు, సంబంధిత శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కొప్పర్రులో అమ్మవారికి కుంకుమ పూజలు





**నర్సాపురం రూరల్, మేజర్ న్యూస్ :** మండలంలోని కొప్పర్రు గ్రామంలోని చిన్న వీధిలో ఏర్పాటుచేసిన కనకదుర్గమ్మ అమ్మవారు శుక్రవారం మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. దసరా సందర్భంగా ఈ గ్రామంలో అనేక చోట్ల అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. శుక్రవారంపోలిశెట్టి సీతారామయ్య సుబ్బలక్ష్మి దంపతుల పసుపు కుంకుమ పూజలు నిర్వహించారు. వీరితోపాటు గ్రామానికి చెందిన పలువురు నూతన వధూవరులు కుంకుమ పూజలలో పాల్గొన్నారు.

## ఆర్టీసీ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి



**నర్సాపురం,మేజర్ న్యూస్ :** ఆర్టీసీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం, పండుగ సెలవులు అమలు చేయాలని కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.తులసిరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మీరా భవనంలో ఆర్టీసీలో పని చేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తులసి రావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థ అయినఆర్టీసీలో అనేక ఏళ్లగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు.సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయుల జీతాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపోలో అనేక విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులు పాల్గొన్నారు.

## ఔషధ మొక్కల పెంపకంతో సహజసిద్ధ ఆరోగ్యం

**– రాష్ట్ర మెడిసినల్ ప్లాంట్స్ బోర్డు చీఫ్ ఈవో ఎ.చంద్రశేఖర్**



**ఆగిరిపల్లి,మేజర్ న్యూస్:** ఔషధ మొక్కల పెంపకంతో సహజ సిద్ధమైన ఆరోగ్యంతో పాటు ఆర్థిక అభివృద్ధి సాధించి జీవనోపాధి పొందుకోవచ్చని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాష్ట్ర మెడిసినల్ , ఆరోమేటిక్ ప్లాంట్స్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎ.చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని పోతవరపాడు గ్రామం గార్డ్సన్ సోషల్ సర్వీస్ సొసైటీ ఆవరణలో శుక్రవారం ఔషధ మొక్కల పెంపకం-ప్రజాభాగస్వామ్యం- జీవనోపాధి అవకాశాలు అను అంశంపై రాష్ట్ర మెడిసినల్ ,ఆరోమేటిక్ ప్లాంట్స్ బోర్డు ఆధ్వర్యంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న చంద్రశేఖర్ మాట్లాడుతూ సుస్థిర విధానం ద్వారా ఔషధ మొక్కల పెంపకంలో స్థానిక ప్రజలను, రైతులను, స్వశక్తి సంఘాలను భాగస్వామ్యు లను చేయడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమన్నారు.డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె. ప్రదీప్ కుమార్ మాట్లాడు తూ ఔషధ మొక్కల పెంపకం వలన ఆరోగ్య భద్రత, సుస్థిర పర్యావరణ పరిరక్షణతో పాటు జీవనోపాధి అవకాశాలను మెరుగు పరచుకోవ చ్చాన్నారు.ఈ కార్యక్రమంలో బోటనీ ప్రొఫెసర్ డా.జి. రమేష్ ,గార్డ్సన్ సోషల్ సర్వీస్ సొసైటీ డైరెక్టర్ కోలేటి పాల్ రమేష్ అధ్యక్షత వహించగా, మెడిసినల్ ప్లాంట్స్ కన్సల్టెంట్ ఎం. విజయ్ కుమార్, వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సేవే లక్ష్యం అభివృద్ధే ఆశయం





## ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్, సేవా స్ఫూర్తి, దాకారపు కృష్ణ సామాజిక సేవా ప్రస్థానం














**జంగారెడ్డిగూడెం,సూర్య ప్రత్యేక ప్రతినిధి :**

'సమాజంపట్ల అంకిత భావంతో, సామాజిక బాధ్యతతో,కన్నతల్లిని,ఉన్నఊరిని మరిచిపో కూడదనే నానుడి ప్రకారం, విద్యా బుద్ధులు ఆర్జించి, జ్ఞానాన్ని, ఆర్థిక సమతుల్యతను సాధించి, ఆత్మ గౌరవాన్ని, ఆత్మస్థైర్యాన్ని,కుటుంబంపట్ల,సమాజంపట్ల సామాజిక బాధ్యతను గుర్తెరిగి, తద్వారా గ్రామాన్ని,పట్టణాన్ని, జిల్లాను, రాష్ట్రాన్ని, దేశాన్ని అభివృద్ధి చేయవచ్చునే సత్యాన్ని గ్రహించి, సమాజానికి ఏదోచేయాలని, ఏదేదోఅభివృద్ధిచేయాలనేఆకాంక్షతో, తాపత్రయంతో, బాధ్యతతో ముందుకు వస్తున్న సేవా రత్న, యువ చైతన్య స్ఫూర్తి, స్వచ్ఛంద సేవకు మారుపేరు, విద్యావేత్త, తపస్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు, సేవా తత్పరులు, ఆపద్బాంధవులు, లెక్కలేనన్ని అవార్డులు, మరెన్నో రివార్డులు సాధించి, రొటేరియన్‌గా కరోనా కష్ట కాలంలో ఎన్నెన్నో సేవలు అందించి, ఇప్పటికీ సొంతనిధులతోఅడిగినవారికి లేదనకుండా చేయూత అందిస్తున్న యువ చార్టెడ్ అకౌంటెంట్ దాకారపు కృష్ణ అడుగులో అడుగు వేయడానికి ఎందరో ముందుకు వస్తున్న శుభ తరుణంలో ఆయన ఆశయ సాధనకు 'నేటి దిన పత్రిక సూర్య' అక్షర నీరాజనం పలుకుతోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ద్వారకాతిరుమల మండలం ఐఎస్ రాఘవాపురం గ్రామంలో దాకారపుచంద్రరావు, సోమేశ్వరీ దంపతులకు 1987వ సంవత్సరం డిసెంబర్ నెల 16వ తేదీన రైతు కుటుంబంలో దాకారపు కృష్ణ జన్మించారు.ఆయనకుఅన్నయ్యదాకారపు నరసింహ మూర్తి, పెద్ద అక్క కామిశెట్టి శ్యామల ఉన్నారు. బండారు సత్యనారాయణ, సత్యవతిల కుమార్తె విజయశ్రీ తో 2017 మార్చి 7వ తేదీన దాకారపు కృష్ణకు వివాహమైంది. ఆయనకు 3వ తరగతి చదువుతున్న రిషితేజ్,యూకేజీ చదువుతున్న జిష్ణు శ్రీ చైతన్య అనే కుమారులు ఉన్నారు. 2023లో ఆయన స్థాపించిన సొంత విద్యా సంస్థతపస్ స్కూలు లోనే వారిని చేర్పించడం విశేషంగా చెప్పవచ్చు.

కాగా దాకారపు కృష్ణ ఏడవ తరగతి వరకు పాఠశాల విద్యలో ప్రథముడు గానిలిచి,లక్కవరం జడ్‌పి హైస్కూల్లో పదవ తరగతిలో ప్రతిభ చూపారు. జంగారెడ్డిగూడెం డిఎస్‌జె జూనియర్ కళాశాలలో ఇంటర్, జంగారెడ్డిగూడెం త్రివేణి కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు.చార్టెడ్ అకౌంటన్సీలో మొదట ప్రయత్నంలోనే ఉత్తీర్ణత సాధించారు.ఐసిడబ్ల్యూఏ ఇంటర్లో ఆల్ ఇండియాలో 35వ ర్యాంకు సంపాదించారు. ప్రస్తుతం ఆయన జంగారెడ్డిగూడెంలోనే ఆయన మామ గారైన ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ బండారు సత్యనారాయణ అండ్.కో.లో మేనేజింగ్ పార్ట్నర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

దాకారపు కృష్ణ సేవా ప్రస్థానం 2019-20నుండి రోటరీ సభ్యునిగా ప్రారంభించారు.సొంత నిధులతో, జన్మభూమి అయిన ఐఎస్ రాఘవాపురం ఎంపీపీ పాఠశాలలో 2లక్షలరూపాయలతోఅభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.2020-21 సంవత్సరంలో రోటరీ క్లబ్‌అధ్యక్షునిగా ఎన్నికై దాదాపు62లక్షల రూపాయల దాతల సహకారంతో,600 సేవా కార్యక్రమాలు నిర్వహించిదాకారపుకృష్ణ నూతనచరిత్ర సృష్టించారు. శ్రీ మొగళ్ళపునరసయ్య ప్రభుత్వఏరియా ఆసుపత్రిలో 2,50,000 రూపాయల వ్యయంతో ప్రసూతి వార్డు ఆధునీకరణ, 80 వేల రూపాయలతో ఈసీజీ మిషన్, 3,60,000 రూపాయలతో 29 మందికి వీల్ చైర్లు, కృత్రిమ అవయవాలు, రెడ్డిగూడెం పాఠశాలకు 80,000తో మంచినీటి సౌకర్యం,వాట్ఈగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 35,000 రూపాయలతో డిజిటల్ క్లాస్ రూమ్,1,20,000తో నిర్మాణం,ఈ విధంగా అంతర్జాతీయ రోటరీ సూచించిన ఏడు ప్రాధాన్యతా అంశాలకు ఏడు శాశ్వత ప్రాజెక్టులు అందించి ఉత్తమ రొటేరియన్‌గా పలువురి మన్ననలు పొందారు.ఒక వరం జంగారెడ్డిగూడెంలలో స్మశాన వాటికల అభివృద్ధి, వివిధ ఆసుపత్రులకు కంప్యూటర్లు బహుకరణ, మహిళా సాధికారతలో భాగంగా 66 మంది మహిళలకు కుట్టు మిషన్లు,9 బాలికల విద్య కోసం సైకిళ్ళు పంపిణీ చేశారు.ఈ విధంగా చెప్పుకుంటూ పోతే దాకారపు కృష్ణ కార్యక్రమాల జాబితా చాలా చాలా ఉందన్నడంలో అతిశయోక్తి లేదు.ఆయన 2024u25 సంవత్సరానికి జిల్లాలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్‌గా ఎన్నికయ్యారు. 2021లో జంగారెడ్డి గూడెంలో శ్రీ మద్ది ఆంజనేయ పరస్పర సహాయ సహకార క్రెడిట్ సొసైటీ వ్యవస్థాపకులుగా, డైరెక్టర్‌గా నాయకత్వం వహిస్తున్నారు. ఇటీవల కె-9 'కస్టమొస్తే కాపు కాద్దాం' అనే కమ్యూనిటీ గ్రూప్ స్థాపించి వ్యవ స్థాపకుడిగా,గౌరవ అధ్యక్షులుగా దాకారపుకృష్ణ సేవలు అందిస్తున్నారు. రైతు కుటుంబం నుండి ఎదిగిన చార్టెడ్ అకౌంటెంట్ దాకారపు కృష్ణ తన వృత్తి ప్రతి భను సమాజ సేవతో మిళితం చేసి ప్రజలకు అధ్భుతమైన సేవలందించారు. ఆయన ప్రజా సేవా రంగంలోకి వచ్చి ఇంకా ఎక్కువ సేవలందించాలని పలువురు కోరుతుండడం గమనార్హం.

# జాతీయ కవి చిలకమర్తి లక్ష్మీనరసింహంకు ఘన నివాళులు





**వీరవాసరం,మేజర్ న్యూస్** : జాతీయ కవి,కళాప్రపూర్ణ, స్వాతంత్ర సమరయోధుడు చిలకమర్తి లక్ష్మీనరసింహం 158 వ జయంతి వీరవాసరం కళాపరిషత్, కాపు సర్వీస్ క్లబ్, కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ ఈ సమావేశానికి గుండా రామకృష్ణ అధ్యక్షత వహించారు. రాజ్యసభ సభ్యులు బిజెపి నాయకులు పాకా సత్యనారాయణ చిలకమర్తి విగ్రహానికి విగ్రహానికి పూలదండలు వేసి ఆయన కీర్తిని చాటిచెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు గ్రహీత తెలుగు పండితుడు పంపన సాయిబాబా, తెలుగు పండితుడు మంకు శ్రీను, విగ్రహ దాత విశ్రాంతి గ్రంథాలయ అధ్యాపకుడు వలవల రామకృష్ణ ను ఘనంగా సన్మానించారు. విగ్రహ దాత చిలకమర్తి జయంతి సందర్భంగా కేక్ కటింగ్ చేశారు. కాపు సర్వీస్ క్లబ్, వనిత క్లబ్ తరపున 100 దుప్పట్లు పంచి పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ఉత్తమ ఉపాధ్యాయుడు తరపున వంగా నరసింహారావు ,జవ్వాది దశరథి శ్రీనివాస్,యర్రంశెట్టి వెంకటరత్నం, కే సూర్యనారాయణ,గోదాసి రాంబాబు, గ్రంధి రామానుజరావు, పాల ఆంజనేయులు, వనిత క్లబ్ అధ్యక్షురాలు డా.బి.లక్ష్మి కళ్యాణి, సెక్రటరీ కామిశెట్టి విజయ లక్ష్మి, ట్రెజరర్ కుంచె వేణు,ఎం. అరుణ, టి.నాగమణి,జి. రమణ, జి.స్వాతి, వి. వెంకటలక్ష్మి. యర్రంశెట్టి గంగారామ్,రిటైర్డ్ డిఎస్పి బోను అప్పాజీ, సిఐ.ఆదిరెడ్డి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

## 19వ తేదీ వరకు జిఎస్టి సూపర్ సేవింగ్స్‌పై సర్వే : ఎంపిడిఓ



**భీమడోలు,మేజర్ న్యూస్** : రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చేందుకు సూపర్ జీఎస్టీ, సూపర్ సిక్స్, పి ఫోర్ కార్యక్రమాలు శక్తివంతమైన ఇంధనంగా పని చేస్తాయని, ముఖ్యమంత్రి పలు పథకాలను దీనికోసం అమలు చేస్తున్నారని, మండల స్థాయి అధికారులు. వీటిని విజయవంతం చేయడానికి తమ వంతు సహాయ సహకారాలు అందజేయాలని,మండల పరిషత్ అభివృద్ధి అధికారి పద్మావతి దేవి కోరారు.మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం మండల స్థాయి అధికారులకు సూపర్ జిఎస్టి సూపర్ ఆరు పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి నిర్వహించారు. ఈ మేరకు సూపర్ జిఎస్టి, సూపర్ సేవింగ్స్ పేర సర్వే కార్యక్రమాన్ని అక్టోబర్ 19వ తేదీ వరకు మండల స్థాయి అధికారులు నిర్వహించవలసి ఉందన్నారు. ఈ నేపథ్యంలో హౌస్ హెూల్డ్ స్థాయిలో మండల స్థాయి అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాల ద్వారా జిఎస్టి తగ్గింపు వల్ల. కలిగే ప్రయోజనాలు గురించి వివరించాలని కోరారు. దీనివల్ల ప్రతి కుటుంబానికి. 15 వేల రూపాయల వరకు ఆదా, వ్యాపారుల అమ్మకాలు పెరిగే విధానాల గురించి తెలియపరచాలని సూచించారు.కార్యక్రమంలో పలువురు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణకు వైసిపి ఆమోదం పట్ల హర్షం



**ఏలూరు,మేజర్ న్యూస్** :ఎస్సీ వర్గీకరణ బిల్లుకు మండల ఆమోదం తెలిపినందుకు వైసిపి నేత ,మాజీ కార్పోరేటర్ మున్నుల జాన్ గురునాథ్, వివిధ దళిత సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. జిల్లా వైఎస్ఆర్సిపి అధికార ప్రతినిధి మున్నుల జాన్ గుర్నాథ్ మాట్లాడుతూ సామాజిక న్యాయానికి కట్టుబడి వైయస్సార్సీపి ఉందని తెలియజేశారు.మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారని, రిజర్వేషన్ ఫలాలు ఎస్సీలులోని 59 ఉప కులాలకు చివర కులాల వరకు రిజర్వేషన్ ఫలాలు అందాలన్న సదుద్దేశంతోనే శాసనసభ మండలిలో వైసిపి ఆమోదం తెలిపిందని అన్నారు.

దళితుల పక్షపాతి మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి, మండలి చైర్మన్ కొయ్య మోషన్ రాజు,మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణకి దళితుల పక్షాన హృదయ పూర్వక కృతజ్ఞత ధన్యవాదాలు తెలియజేస్తునట్లు జాన్ పేర్కొన్నారు.

# నాయక్ కులస్థులకు ఎస్టీ సర్టిఫికెట్లు జారీ చేయాలి

### - అసెంబ్లీలో ఎమ్మెల్యే రోషన్ కుమార్ ప్రభుత్వానికి వినతి



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్**: చింతలపూడి నియోజకవర్గంలోని మైదాన ప్రాంతంలో నివాసం ఉంటున్న నాయక్ కులస్తులకు ఎస్టీ కుల సర్టిఫికెట్లను జారీ చేయాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జరిగిన శాసనసభ సమావేశంలో ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ మైదాన ప్రాంతంలోని నివసించే నాయక్ కులస్తులకు ఎస్టీ సర్టిఫికెట్లు ఇచ్చే విషయంలో నెలకొన్న ప్రతిష్టంభన ను తొలగించాలని కోరారు. కామవరపుకోట మండలంలో సుమారు 1500 మందికి పైగా నాయక్ కులస్తులు నివాసం ఉంటున్నారని తెలిపారు. వీరికి గత టిడిపి ప్రభుత్వంలో 2014 -19 మధ్యకాలంలో ఎస్టీలుగా కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం జరిగిందని గుర్తు చేశారు. గతంలో వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీరందరూ కూడా టిడిపి అభిమానులని చెప్పి వీరికి కుల ధ్రువీకరణ పత్రం లేకుండా చేశారని విమర్శించారు.వీరంతా ఎస్టీలుగా సంప్రదాయాలు పాటిస్తున్నా కూడా ప్రభుత్వాల నుండి ఎస్టీలుగా పలు పథకాలు పొందలేకపోతున్నా రని తెలిపారు.

ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం పై సమగ్ర పరిశీలన చేసి మైదాన ప్రాంతంలో ఉన్న నాయక్ కులస్తులకు తక్షణమే ఎస్టీ సర్టిఫికెట్లను జారీ చేయించాలని కోరారు. ఎమ్మెల్యే రోషన్ కుమార్ ఉపసభాపతి రఘు రామ కృష్ణంరాజు ద్వారా ప్రభుత్వానికి విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు.

## పాలమూరు సొసైటీ ప్రగతికి కృషి చేయాలి



**పెనుమంట్ర,మేజర్ న్యూస్** : పాలమూరు సొసైటీ ప్రగతికి కృషి చేయాలని, అందుకు ప్రభుత్వం నుండి సంపూర్ణ సహకారం అందుతుందని జిల్లా డి.సి.ఎం.ఎస్. చైర్మన్ చాగంటి మురళీ కృష్ణ, ఆప్ కో చైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. శుక్రవారం పెనుమంట్ర మండలం నుండి సొసైటీ చైర్మన్ లుగా పదవులు చేపట్టిన పలువురికి వారు మీటింగ్ హాల్లో అభినందన సత్కారం చేశారు.ఈ మేరకు మండలంలోని పాలమూరు సొసైటీ చైర్మన్ కండిబోయిన శ్రీనివాస్, సత్యవరం సొసైటీ చైర్మన్ మైగాపుల రామ తదితరులను వారు సత్కారం చేసి,సొసైటీ ల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

## ప్రభుత్వ భూముల్లోని కొబ్బరి చెట్లు పేదలకు పంచాలి



**పెనుగొండ మేజర్ న్యూస్** : ప్రభుత్వ పోరంబోకు, మురుగు పంట కాల్వల గట్లు వెంబడి ఉన్న కొబ్బరి చెట్లు ఫల సాయం పేదలకు స్వాధీనం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జ్ అన్నారు.శుక్రవారం పెనుగొండ గ్రామ పంచాయతీ వద్ద షేక్ పాదుషా అధ్యక్షతన జరిగిన మహాసభలో మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులైన నిరుపేదలు 360 రోజులు పనులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారి జీవనోపాధి కోసం ప్రభుత్వ భూముల్లో ఉన్న కొబ్బరి చెట్లను వారికి స్వాధీనం చేయడానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. కొంతమంది గ్రామ పెద్దల స్వాధీనంలో కొబ్బరి ఫల సాయాన్ని ఏళ్ల తరబడి అనుభవిస్తున్నారని చెప్పారు. మహాసభలో మండల కార్యదర్శి షేక్ పాదుషా గత మూడు సంవత్సరాల కార్యక్రమాలు నివేదిక ప్రవేశపెట్టారు, సభ్యులు చర్చించిన అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా పూతినీడి పద్మ, ఉపాధ్యక్షులుగా మామిడి శెట్టి ఏడుకొండలు, కార్యదర్శిగా కుడుపూడి ప్రసాదు, సహాయ కార్యదర్శిగా షేక్ పాదుషా, కమిటీ సభ్యులుగా కె వి వి సత్యనారాయణ, కే నరసింహమూర్తి, కే నారాయణ ఏడుగురితో పెనుగొండ మండల కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయింది. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్ వెంకటేశ్వరరావు, మహిళా సంఘం నాయకురాలు జక్కం శెట్టి వెంకటలక్ష్మి, మాదాసు నాగేశ్వరరావు, శీలం ఏసు తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర కళాశాలలో ఎన్ సి సి ఎన్రోల్మెంట్




**నర్సాపురం రూరల్, మేజర్ న్యూస్** : మండలంలోని సీతారాంపురం లోగల స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల నందు, 7(ఏ) నావెల్ యూనిట్ వారి ఎన్ సి సి ఎన్రోల్మెంట్ 2025 సంవత్సరానికి గాను ప్రవేశాల ప్రక్రియ శుక్రవారం ఉదయం నుండి సాయంత్రం వరకు నిర్వహించారు. లెఫ్టినెంట్ కమాండర్ చిట్టి రోహిత్ కుమార్ (సిఓ) అధ్యక్షతన విద్యార్థిని విద్యార్థులకు శరీర దారుఢ్య పరీక్షలు, రాత పరీక్షలు, ఆరోగ్య పరీక్షలు ముఖాముఖి ద్వారా 18 మంది విద్యార్థులు విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని లెఫ్టినెంట్ కమాండర్ చిట్టి రోహిత్ కుమార్ ( సి ఓ) తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లెఫ్టినెంట్ సంజిత్ రౌత్రాయ్ , కళాశాల చైర్మన్ కె.వి సత్యనారాయణ, కోశాధికారి కే వెంకటేశ్వర స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ సురేష్ కుమార్, కళాశాల కేర్ టేకర్ ఆఫీసర్ ఇస్సా మాణిక్యాలరావు, 7(ఏ) నావెల్ యూనిట్ పి. ఐ. స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.1.5లక్షలతో ధనలక్ష్మిగా వాసవి మాత




**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ :** తాడేపల్లిగూడెం ఏలూరు రోడ్‌లో వేంచేసి ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో 58వ శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవ వైభవంగా జరుగుతున్నాయి. వాసవి మాత విశేషాలంకారంలో కోటి 50 లక్షలు కొత్త కరెన్సీతో ధనలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ మూర్తిగా విజయలక్ష్మిగా పూజలు అందుకుంటున్నారు. ఆర్యవైశ్య మహిళలు వాసవి క్లబ్ మహిళలు భక్తులు పెద్ద సంఖ్యలో రాగా లలితా పారాయణం నిర్వహించారు. కొర్లేపర రాము దంపతులు విశేష పూజలలో భాగంగా భస్మ పార్థివ లింగార్చన పూజ అత్యంత వైభవంగా చేయడం జరిగింది. నక్షత్ర జప హెూమములు అష్టోత్తర శతకమల హెూమములు, నీరాజనం మంత్రపుష్పం చతుర్వేద స్వస్తి దర్బారు సేవ తీర్థప్రసాద వినియోగం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు మారం వెంకటేశ్వరరావు అధ్యక్షులు కొర్లేపర శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన కార్యదర్శి నున్న బాలత్రిపుర సుందర రావు, కోశాధికారి భోగవిల్లి రమేష్, ఉత్సవ కమిటీ అధ్యక్షులు వబిలిశెట్టి నటరాజు,ఆలయ కార్యదర్శులు ఆలపాటి సత్యనారాయణ, ఆలపాటి కృష్ణకుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# 6 కాసుల బంగారం,10 తులాల వెండి,25 వేల నగదు చోరీ

**ఏలూరు, మేజర్ న్యూస్:** ఏలూరు వట్లూరు ప్రాంతానికి చెందిన ధనలక్ష్మి అనే మహిళ తన భర్త కాలికి శస్త్ర చికిత్స నిమిత్తం ఇంటికి తాళాలు వేసి ఆసుపత్రికి వెళ్లి తిరిగి 10 రోజుల తర్వాత ఇంటికి వచ్చింది.ఇంటి బీరువా తాళాలు వేసిన వేసినట్టుగానే ఉండి అందులో ఉండవలసిన 6 కాసుల బంగారు ఆభరణాలు,10 తులాల వెండి ఆభరణాలు, 25వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించింది. గురువారం రాత్రి పోలీసులకు ఆమె ఫిర్యాదు చేయడంతో త్రీత్రీ టౌన్ టౌన్ సిఐ కోటేశ్వరరావు కేసు నమోదు చేశారు.

## తప్పనిసరిగా అప్సడా పర్మిషన్ తీసుకోవాలి



**కలిదిండి /కైకలూరు, మేజర్ న్యూస్,** ఆక్వా రైతులందరూ తప్పనిసరిగా అప్సడా పర్మిషన్ తీసుకోవాలని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు రైతులను కోరారు. కలిదిండి మండలం మట్టగుంట గ్రామంలో ఫిషరీస్ అధికారులు ఏర్పాటు చేసిన ఆక్వా రైతుల అవగాహన సదస్సులో పాల్గొని శ్రీనివాసరావు మాట్లాడుతూ చేపలు రొయ్యలు సాగు చేస్తున్న ఆక్వా రైతులు ప్రతి ఒక్కరు ఆక్వాకల్చర్ అభివృద్ధి అధారిటీ చట్టం 2020(అప్సడా) ప్రకారం పర్మిషన్ తీసుకుని కరెంటు సబ్సిడీ మరియు ఆక్వా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలనుఉపయోగించుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమం లో పంచాయితీ కార్యదర్శి గంగా శంకర్, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ పొడేటి రాంబాబు, డీసీ వైస్ చైర్మన్ నాగిడి వీరబ్రహం, ఆక్వా రైతులు తిరుమాని పాండురంగారావు. దున్నా సత్యనారాయణ. తిరుమల శెట్టి ఈశ్వర పరశురాముడు. తదితరులు పాల్గొన్నారు.

## మూడవ రోజుకు చేరిన పారిశుధ్య సెక్యూరిటీ సిబ్బంది ధర్నా



**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్** తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శానిటేషన్ సెక్యూరిటీ సిబ్బంది సమస్య లు పరిష్కరించాలంటూ శుక్రవారం మూడవరోజు ధర్నా చేశారు. ఈ కార్యక్రమానికి ఏ.ఐ టి.యూ.సి. ఆర్గనైజింగ్ కార్యదర్శి కే. లక్ష్మీనారాయణ నేతృత్వం వహించారు. శానిటేషన్ సిబ్బందికి ఐదు నెలలుగా జీతాలు అందడం లేదన్నారు.50 నెలలుగా పిఎఫ్ జమ కావడం లేదన్నారు. ఈ సమస్యలపై ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్,డిసి హెచ్ ఎస్ జిల్లా కలెక్టర్,ఉప ముఖ్యమంత్రి, స్థానిక శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్‌కు వినతి పత్రాలు అందజేసినా పరిష్కారం లభించలేదన్నారు. సెక్యూరిటీ సిబ్బందికి రూ18,600 జీతం ఇవ్వాలని జీవో ఉన్నప్పటికీ కాంట్రాక్టర్ రూ11,000 ఇస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సెక్యూరిటీ సిబ్బంది నాగేంద్ర, రవణమ్మ, సురేష్, కుమారి తదితరులు పాల్గొన్నారు.

## హెల్త్ వర్కర్ల హాజరు పరిశీలించిన కమీషనర్



**నర్సాపురం, మేజర్ న్యూస్ :** పురపాలక సంఘం నందు పనిచేయుచున్న రెండు డివిజన్లలోని పబ్లిక్ హెల్త్ వర్కర్ల అటెండెన్స్ ను మున్సిపల్ కమిషనర్ తనిఖీ చేశారు. శుక్రవారం తెల్లవారుజామున ఐదు గంటలకు ఈ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం 20,21, 26వ వార్డులలో పర్యటించి డ్రెయిన్లో పూడిక తొలగింపు పనులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు జరిచేసినారు., పట్టణంలో పారిశుధ్యం మెరుగుదలకు తక్షణమే చర్యలు చేపట్టాలని శానిటరీ సిబ్బందిని ఆయన ఆదేశించారు.

# యునైటెడ్ కాపు వనితాక్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



**నర్సాపురం, మేజర్ న్యూస్ :** స్థానిక ఒ.యన్ జి .సి క్లబ్ లో శుక్రవారం యునైటెడ్ కాపు వనితాక్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, జిల్లా టిడిపి మహిళా అధ్యక్షురాలు, యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ మహిళా డైరక్టర్ డాక్టర్ రాజ్యలక్ష్మి శిరిగినీడి ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిధిగా హాజరయిన యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ గవర్నర్ పెనుమాక రామ్మోహన్ రావు అధ్యక్షురాలిగా బండి స్వర్ణలత, కార్యదర్శిగా రంగినీడి భరణి, కోశాధికారిగా సలాది మణికర్ణిక చే ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ నూతన టీమ్ వనితాక్లబ్ సేవలను మరింత విస్తృతపరచాలని కోరారు.

మహిళలకు సంబంధించిన మెడికల్ క్యాంప్స్‌ని నిర్వహించాలని కోరారు. డాక్టర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ నూతన టీమ్‌కు శుభాకాంక్షలు అందచేసి భవిష్యత్తులో మరిన్ని సేవాకార్య క్రమాలకు శ్రీకారం చుట్టి ఆపదలో ఉన్న పేదలను ఆదుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పుప్పాల ఉషాకమల, జాయింట్ సెక్రటరీ తోట భారతి, సభ్యులు గంటా వెంకటరమణ, సుంకర రాజకుమారి, నాగమణి, తోట చంటి, దేవి, పూజిత, కుసుమ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఒక నిరుపేదరాలికి నిత్యావసర వస్తువులు పుప్పాల ఉషాకమల తండ్రి జన్మదినం సందర్భంగా అందజేశారు.

## మాజీ సిఎం జగన్‌పై బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలి



పాలకొల్లు, మేజర్ న్యూస్ : అసెంబ్లీలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ని సైకో గాడు అని అసెంబ్లీ సాక్షిగా బాలకృష్ణ దుర్భాషలాడటం సమాజానికే సిగ్గుచేటని వైసిపి రాష్ట్ర మహిళ విభాగం జనరల్ సెక్రెటరీ,కాకినాడ జిల్లా మహిళా విభాగం ఇన్చార్జ్ కర్రి జయ సరిత అన్నారు, పార్టీలపై విద్వేషాలు ఉన్నంత మాత్రాన తన స్థాయిని మరిచి బాలకృష్ణ హుందాగా వ్యవహరించకుండా ఇలా చౌకబారు వ్యాఖ్యలు చేయడం తగదని ,శాసనసభ సమావేశంలో ప్రతి ఒక్కరు హుందాగా వ్యవహరించాలి కానీ, సభలోఆ వ్యక్తి లేకుండా ఆ వ్యక్తి గురించి ఇలా మాట్లాడటం తగదు అన్నారు, ఇ ప్పటికైనా నందమూరి బాలకృష్ణ తన తప్పు తెలుసుకొని తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు, అదేవిధంగా సమాజం తలదించుకునే విధంగా మాట్లాడిన భాషను కూడా శాసనసభలో స్పీకర్ రికార్డ్ నుంచి తొలగించాలని రాజకీయాలలో విమర్శలు అనేవి హుందాగా ఉండాలి కానీ,అసభ్య కరంగాఉండకూడదని, బాలకృష్ణ సభలో నెత్తిన కళ్ళజోడు జేబులో చేతులు పెట్టుకుని మాట్లాడటం అంటే సభా మర్యాదలను అగౌరవ పరిచినట్టేనని ఆమె అన్నారు.

## లక్ష్మీదేవికి లక్ష కుంకుమార్చన



**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్ :** దేవి శరన్నవరాత్రి మహెూత్సవం పురస్కరించుకుని లక్ష్మీపురం గ్రామంలో కనకదుర్గ అమ్మవారి ఆలయంలో మహిళలచే లక్ష్మీదేవికి లక్ష కుంకుమార్చన లలితా పారాయణం నిర్వహించారు. పండితులు మొరపాకల శివరామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామ పెద్దల సహకారంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దలు పీతల నాగేశ్వరరావు,యరమల సత్యనారాయణ, చేతికూరి నవీన్, మొడియం రమేష్, పైడిమల కృష్ణ, వేదుల జనార్దన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## 80 ఆర్‌టిసి బస్సులకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు పంపిణీ



పాలకొల్లు, మేజర్ న్యూస్: చవాకుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నరసాపురం ఆర్టీసీ డిపో లోని 80 బస్సులకు ఫస్ట్ ఎయిడ్ కిట్స్‌ను నర్సాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ సుబ్బన్న రెడ్డి కి చవాకుల చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ,చైర్మన్ డాక్టర్ చవాకుల సూర్య నరేష్ బాబు అందజేశారు, ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ పాలకొల్లు సన్ రైజ్ అధ్యక్షులు మాజేటి రాజా, నెలకుర్తి కృష్ణమోహన్ ,కెవిఎస్ బి పవన్ ,పినిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు,

## రూ.5 లక్షలతో కనకదుర్గమ్మ అమ్మవారికి అలంకరణ



**పాలకొల్లు,మేజర్ న్యూస్:** స్థానిక ఎడ్ల బజార్లో వేంచేసి ఉన్న శ్రీ కనకదుర్గ మల్లేశ్వర స్వామి దేవస్థానము నందు దేవి శరన్నవరాత్రుల సందర్భంగా మహాలక్ష్మి అమ్మవారి అవతారానికి ఐదు లక్షల రూపాయలతో అలంకరించారు, భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు

# నేవీ ఆయుధాగారం ఏర్పాటు జిల్లాకు వరం





– భద్రతాపరంగా ఎటువంటి ముప్పులేదు – అపోహలు నమ్మొద్దు
– జిల్లా అభివృద్దే ధ్యేయం : ఎంపీ పుట్టా మహేష్ కుమార్

**ఏలూరు, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ, జిల్లా అభివృద్దే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అన్నారు. ఏలూరులోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలిసిన మీడియా ప్రతినిధులతో ఎంపీ మాట్లాడారు. జీలుగుమిల్లి వద్ద నేవీ ఆయుధాగారం ఏర్పాటు జిల్లాకు వరం వంటిదని, ఈ ప్రాజెక్టు వల్ల పోలవరం నియోజకవర్గంతో పాటు ఏలూరు జిల్లాకు కూడా పేరు వస్తుందన్నారు. దేశంలో ఎన్నో ఆయుధ డిపోలు ఉన్నాయి, భద్రతాపరంగా ఎటువంటి ముప్పులేదు, కేవలం 1166 ఎకరాల్లోనే ఈ ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తున్నారు, భూమి కోల్పోయే రైతులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి కింద పరిహారం చెల్లిస్తామని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. గిరిజనులు ఎక్కువగా ఉండే వెనుకబడ్డ పోలవరం ప్రాంతం కూడా పట్టణాలతో సమంగా అభివృద్ధి చెందాలని, అక్కడి యువతకు ఉపాధి అవకాశాలు లభించాలనే ఉద్దేశంతోనే జీలుగుమిల్లి ప్రాంతంలో ఈ డిపో పెట్టాలని నిర్ణయించామన్నారు. అపోహలతో అభివృద్ధి కార్యక్రమాలకు ఎవరూ అడ్డుపడొద్దని విజ్ఞప్తి చేస్తున్నామని, గిరిజనులకు కూడా విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు లభించాలనేదే మా ధ్యేయం అని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు.

– సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ –అంతకు ముందు శాంతి నగర్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించిన సమయంలో పలువురు ప్రజలు ఎంపీని కలిసి తమ సమస్యలపై వినతి పత్రాలు సమర్పించారు. సమస్యలను విన్న ఎంపీ అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేశారు. బాదంపూడి ఎస్సీ కాలనీ గ్రామస్థులు ఎంపీని కలిసి ప్రతిపాదిత రైల్వే గేట్ ఆర్‌ఓబి వల్ల పేదల ఇళ్ళు కోల్పోతున్న పరిస్థితిని ఎంపీకి వివరించారు. దీనిపై స్పందించిన ఎంపీ రైల్వే అధికారులతో చర్చించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 37 మందికి 17.5 లక్షలు విలువైన సీఎంఆర్ ఎఫ్ చెక్కులను అందించిన ఎంపీ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

# ఎస్సీ ,ఎస్టీ కేసుల విచారణ వేగవంతం చేయాలి

– జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం,మేజర్ న్యూస్:** శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాలపై జరిగిన దాడులకు సంబంధించి నమోదైన కేసులపై విచారణ వేగవంతం చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించి పరిహారం చెల్లించేందుకు తహసీల్దార్లు సంబంధిత ధ్రువపత్రాలను త్వరితిగతిన పంపించాలన్నారు. 2023 – 24 సంవత్సరానికి 35 కేసులకు సంబంధించి 48 లక్షల రూపాయలు బాధితులకు పరిహారం అందించడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం మే,2025 నుండి ఇప్పటివరకు 11 కేసులు నమోదయ్యాయని బాధితులకు పరిహారం చెల్లించేందుకు ప్రాసెస్ జరుగుతుందన్నారు. ఈ గూగుల్‌మీట్‌లో జిల్లా ఎస్పీ అద్నాన్‌నయీంఅస్మి,డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి,జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎన్.వి.అరుణ కుమారి, రెవిన్యూ డివిజనల్ అధికారులు కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, దాసిరాజు, ఖతీబ్ కౌసర్ భానో,డీఎస్పీలు జైసూర్య, శ్రీవేద,డి.విశ్వనాథ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శారదామణి, తదితరులు పాల్గొన్నారు.



# దేశ సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల లక్ష్యం రూ.1 లక్ష కోట్లు

– ఆక్వా రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ ధ్యేయం
– ఎస్ఇఎఐ స్వర్ణోత్సవంలో కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ




**న్యూఢిల్లీ/భీమవరం,మేజర్‌న్యూస్ :** భారతదేశ సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదారులసంఘం స్వర్ణోత్సవ వేడుకలను పురస్కరించుకుని న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంకు కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఆక్వా రైతునని,ఈ రొయ్యల పెంపకంలో ఎన్నో ఎత్తుపల్లాలను చూశానని పరిశ్రమతో తన అనుబంధాన్ని తెలియజేశారు. ఈ ఆర్థిక సంవత్సరం 2024–25లో భారతదేశ సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు 7.45 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దార్శనికతతో, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ద్వారా మత్స్యరంగం మొత్తం విలువ గొలుసును ఆధునీకరించి, ఎగుమతులను 1లక్ష కోట్ల లక్ష్యానికి పెంచాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లను తాను ఎస్ఇఎఐ అధ్యక్షులు పవన్ కుమార్‌తో కలిసి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి తీసుకువెళ్ళానని,వాణిజ్య మంత్రి కూడా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారని శ్రీనివాస వర్మ తెలిపారు.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం ఆక్వా రైతుకు అండగా నిలబడుతుందని, రైతు ప్రయోజనం కాపాడటంలో రాజీ పడకూడదు అని మోదీ స్పష్టం చేశారని ఆయన పునరుద్ఘాటించారు.

ఆంధ్రప్రదేశ్‌లో శాస్త్రీయ పద్ధతులను అవలంబించిన చిన్న రైతుల నుండి అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ఆధునిక ప్రాసెసింగ్ కేంద్రాల ద్వారా తన సహజ ప్రయోజనాన్ని ప్రపంచ నాయకత్వంగా ఎలా మార్చుకుందో చూపింది అని కేంద్ర మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పవర్, కొత్త, పునరుత్పాదక శక్తి సహాయ మంత్రి శ్రీపాద్ నాయక్, స్పెషల్ సెక్రటరీ అండ్ కామర్స్ సెక్రటరీ (డిజిగ్నేట్) రాజేష్ అగర్వాల్, ఎస్ఇఎఐ అధ్యక్షులు పవన్ కుమార్,ఎస్ఇఎఐ పూర్వ అధ్యక్షులు జగదీష్ , ఎస్ఇఎఐ సెక్రటరీ జనరల్ డా.కె.ఎన్. రాఘవన్ తదితరులు పాల్గొన్నారు.

# బాలకృష్ణ లోనే సైకో లక్షణాలు

## : జెడ్పిటిసి గౌరీ సుభాషిణి



పెనుమంట్ర,మేజర్ న్యూస్ : అసెంబ్లీ లో మాజీ ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి సైకో గాడు అంటూ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అనడం అతనిలోని సైకో లక్షణాలకు నిదర్శనం అని రాష్ట్ర వైసీపీ మహిళా నాయకురాలు, స్థానిక జెడ్పిటిసి కర్రి గౌరీ సుభాషిణి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒక మానసిక రోగిగా సర్టిఫికెట్ పొందిన బాలకృష్ణ ఈరోజు చట్టసభ సాక్షిగా తాను యావత్ ప్రపంచానికి ఒక నిజమైన మానసిక రోగిగా నిరూపించుకున్నారని ఆమె పేర్కొన్నారు. ఈరోజు రాష్ట్రంలో 40 శాతం ఓటు బ్యాంకు కలిగిన ఒకే ఒక్క పార్టీగా వైసిపి నాయకుడిగా ప్రజల మన్ననలను పొందిన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని సైకోగాడు అని విమర్శించడం అతనిలో ఉన్నటువంటి సైకో లక్షణాలు బయటపడినట్లు ఉందన్నారు. జగన్మోహన్ రెడ్డిని మాత్రమే కాకుండా సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ హీరో చిరంజీవిని కూడా చులకన చేస్తూ మాట్లాడడం అతనికి ఉన్న మానసిక పరిస్థితి అర్థం అవుతుందన్నారు.

### మహిళలపై జరిగే నేరాల నివారణకు శక్తి టీం చర్యలు




పెదపాడు,మేజర్ న్యూస్: జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాలపై జిల్లా శక్తి టీం సభ్యులు కాలేజ్‌ల వద్ద వివిధ ప్రాంతాలలో మహిళా పోలీస్ స్టేషన్ మహిళా ఎస్సై నాగమణి శక్తి టీం సభ్యులు వట్లూరులో శుక్రవారం మహిళలపై జరిగే నేరాల నివారణకు మోటార్ సైకిల్‌పై గస్తీ శక్తి టీం సభ్యులు నిర్వహించారు. బాలికల భద్రతను ప్రథమ ప్రాధాన్యంగా తీసుకుంటూ,జిల్లా వ్యాప్తంగా స్కూళ్లు ,కళాశాలల వద్ద ఆకతాయిలు వేధింపులకు పాల్పడకుండా నివారించేందుకు శక్తి టీం సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పాఠశాలలు, కళాశాలలు పరిసరాల్లో గస్తీ నిర్వహిస్తూ, అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులపై పర్యవేక్షణ కొనసాగించారు. బాలికలకు 'గుడ్ టచ్ – బ్యాడ్ టచ్' అనే ముఖ్యమైన మహిళా చట్టాల పై అవగాహన కల్పిస్తూ, వారి హక్కులపై, రక్షణ మార్గాలపై వివరంగా చర్చించారు.ఏవైనా వేధింపులు జరిగిన సందర్భంలో డయల్ 112, 181కు లేదా శక్తి టోల్ ఫ్రీ నెంబర్ 7993485111కు కాల్ చేయాలి అనే విషయాన్ని స్పష్టంగా తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా శక్తి దళం సభ్యులు గస్తీలు నిర్వహిస్తూ మహిళా చట్టాలను గురించి బాలికల రక్షణ కొరకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లుగా సిఐ ఎం.సుబ్బారావు తెలిపారు.

### షాపులపై మున్సిపల్ అధికారులు మెరుపు దాడి



నర్సాపురం, మేజర్ న్యూస్ : మున్సిపల్ కమీషనర్ యం అంజయ్య ఆధ్వర్యములో శానిటేషన్ టాస్క్‌ఫోర్స్ టీముల వారితో పట్టణములోని పంజా సెంటర్ ఏరియా నందు గల కిరాణ షాపులు, జ్యూస్ సెంటర్లు, హొటల్స్, స్వీట్ షాప్స్ , బెకరి షాప్స్ మొదలగు షాపుల పై ప్రజారోగ్యం దృష్ట్యా ఆకస్మిక దాడులు జరిపారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో పర్యావరణము నకు హాని కలిగించే నిషేధిత ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను, సింగిల్ యూజ్ప్లాస్టిక్ వస్తువులను 10 కె.జి.ల వరకు స్వాధిన పరచుకొని సదరు షాపుల వారికి రూ.3వేలు జరిమానాలు విధించారు. ఈకార్యక్రమములో శానిటరీ ఇనస్పెక్టర్లు–1–2, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీ లు, శానిటరీ మేస్త్రీ లు ఇతర సిబ్బందిపాల్గొన్నారు.